
మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి




# మనం

జనం కోసం అక్షర యజ్ఞం...

ఉమ్మడి

## ఉత్తరాంధ్ర జిల్లాలు

మంగళవారం | 22 | సెప్టెంబర్ | 2026 పేజీలు : 08


# భారీ వర్షాలతో ప్రభుత్వ యంత్రాంగాన్ని అలెర్ట్ చేసిన హోం మంత్రి అనిత

**విశాఖపట్నం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాబోయే రెండు రోజుల్లో తీవ్ర వాయుగుండంగా బలపడి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాల వైపు పయనించే అవకాశం ఉందన్న హెచ్చరికల నేపథ్యంలో రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖా మంత్రి వంగలపూడి అనిత సోమవారం ఉన్నత స్థాయి అత్యవసర సమీక్ష నిర్వహించారు. ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, విపత్తుల నిర్వహణ సంస్థ ఎండి ప్రఖర్ జైన్, ఇతర ఉన్నతాధికారులతో అత్యవసర టెలికాన్ఫరెన్స్ నిర్వహించి క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన ముందస్తు భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు. తీవ్ర వాయుగుండం ప్రభావంతో బుధ, గురువారాల్లో ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఒడిశాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వంశధార, నాగావళి నదుల ప్రవాహాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఒడిశా సరిహద్దు జిల్లాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలని ఆదేశించారు. అత్యవసర సహాయక చర్యల కోసం ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను



సిద్ధంగా ఉంచాలన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను 24 గంటలూ అందుబాటులో ఉంచి, క్షేత్రస్థాయి అధికారులు పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా నిత్యావసరాలు, వైద్యం, ఇతర అత్యవసర సదుపాయాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. తీరప్రాంత, లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అవసరమైతే వెంటనే పునరావాస కేంద్రాలకు తరలించాలని స్పష్టం చేశారు. పొంగిపొర్లే వాగులు, ప్రమాదకరమైన కాజ్‌వేలు, ముంపు ప్రాంతాల వద్ద తప్పనిసరిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రాణనష్టం జరగకుండా వాహనాలు, ప్రజల రాకపోకలను కట్టడి చేయాలని సూచించారు. ఈ తీవ్ర వాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి గంటకు 50 నుండి 60 కిలో మీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని హెచ్చరించారు. చెట్లు, భారీ హోర్డింగ్స్, పాతబడిన శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో ఉండరాదని సూచించారు. ప్రజలందరూ ప్రభుత్వం జారీ చేసే అధికారిక సూచనలను పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హోం మంత్రి అనిత విజ్ఞప్తి చేశారు.

## ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈగా 'పోలాకి శ్రీనివాసరావు' బాధ్యతల స్వీకరణ

ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన సిబ్బంది, యూనియన్ నాయకులు




**విశాఖపట్నం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ (ఆపరేషన్, మధురవాడ)గా పోలాకి శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన జోన్-1 ఆపరేషన్ ఈఈగా పని చేసిన సంగతి తెలిసిందే. బదిలీపై ఇక్కడకు వచ్చిన ఆయనను పెద్ద సంఖ్యలో ఇంజి నీరింగ్, అకౌంట్స్, రెవెన్యూ, ఓఅండ్ఎం, అవుట్‌సోర్సి ంగ్ సిబ్బం ది, ఇంజినీర్లతో పాటు వివిధ యూనియన్ల నాయకులు, వినియో గదారులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పోలాకి శ్రీనివాసరావు అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా, నాణ్యమైన విద్యుత్ అందించడం, ప్రభుత్వ ఆదేశాలతో పాటు సంస్థ మార్గదర్శకాల్ని సమర్థవంతంగా అమలు చేయడమే తన ప్రధాన లక్ష్యమన్నారు. అందరి సహకారంతో సమన్వయంతో పని చేస్తూ జోన్-3 డివిజన్‌ను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ దంపతులు

**సింహాచలం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** సింహాచలం శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారిని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయ పర్యవేక్షణ అధికారి జి.వి.ఎస్.కె. ప్రసాద్ సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు ఆలయ సంప్రదాయాలను అనుసరించి ముందుగా మహిమాన్వితమైన





కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని స్వామివారి దర్శనం చేసుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం వేద పండితులు ఎమ్మెల్యే దంపతులకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ అధికారులు శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి సభ్యులు కరకదేవుడు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గురజాడ వెంకట అప్పారావు జయంతి



ఏ ఎస్ ఆర్ జిల్లా, పాడేరు , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) : మహాకవి, యుగపురుషుడు గురజాడ వెంకట అప్పారావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు . సోమవారం ఉదయం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గురజాడ అప్పారావు వారి చిత్ర పాఠనికి పూలమాలవేసి నివాళులర్పించిన జిల్లా కలెక్టర్ నిషాంతి. టి ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మహా కవి రాసిన నాటకాలలో నాటక రాజం "కన్యాశుల్కం" ద్వారా ఆనాటి సమాజంలోని దురాచారాలను, మూఢనమ్మకాలను నిరసిస్తూ ఆధునిక తెలుగు సాహిత్యానికి గురజాడ నూతన దిశానిర్దేశం చేశారని కొనియాడారు. "దేశమంటే మట్టి కాదోయ్.. దేశమంటే మనుషులోయ్" అని ఆయన అందించిన అమూల్యమైన సందేశం నిరంతరం స్ఫూర్తిదాయకమని, సదా ప్రాతఃస్మరణీయమని పేర్కొన్నారు. గురజాడ రచనలు, గేయాలు నేటికీ సామాజిక చైతన్యానికి మార్గదర్శకాలుగా నిలుస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. మహాకవి చూపిన ఆదర్శవంతమైన బాటలో పయనిస్తూ, సమాజ శ్రేయస్సుకు,,అభ్యు దయానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని కలెక్టర్ పిలుపు నిచ్చారు. గురజాడ అప్పారావు సమాజానికి చేసిన విశిష్టసేవలను స్మరించు కున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఏంవిఎస్ లోకేశ్వ రావు, జిల్లా టూరిజం అధికారి పట్టాసి చలపతిరావు, డిఎంహెచ్ఓ రియాజ్ భైగ్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు 120 ఫిర్యాదులు

## నగర పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో సీపీ శంఖబ్రత బాగ్చీ ఆధ్వర్యంలో పీజీ ఆర్ ఎస్ నిర్వహణ



విశాఖపట్నం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) : ప్రతీ సోమవారం నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఈ రోజు 120 ఫిర్యాదులు రావడం జరిగింది. ఈ పీజీఆర్ ఎస్ కార్యక్రమంలో నగర పోలీసు కమీషనర్ లిడా. శంఖబ్రత బాగ్చి, ప్రత్యక్షంగా నగర పోలీసు సమావేశ మందిరం నందు ఉండి, నగర సబ్-డివిజన్ ఏసీపీలు మరియు పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొని ఫిర్యాదులు స్వీకరించారు. సోమవారం జరిగిన పీజీఆర్ ఎస్ కార్యక్రమానికి 120 మంది ఫిర్యాదుదారులు వచ్చి తమ తమ సమస్యలను రిపోర్టుల ద్వారా పోలీసు కమిషనర్ గారికి అందజేశారు. సీపీ ఫిర్యాదులను పరిశీలించి ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి, వారి వారి సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో తక్షణమే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, సమస్యకు సంబంధించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు

# జల్ జీవన్ మిషన్ పనులను త్వరగా పూర్తి చేయాలి



లావేరు , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) : జల్ జీవన్ మిషన్ తాగునీరు పథకం కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నరేంద్ర మోడీ ప్రధానమంత్రి ప్రవేశపెట్టి నపథకాన్ని త్వరగా పూర్తి చేయాలని సోమవారం స్థానిక ఎచ్చర్ల శాసనసభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు క్యాంప్ కార్యాలయంలో లావేరు జిసగడం ఎచ్చెర్ల రణస్థలం నాలుగు మండలాల అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు కొన్ని గ్రామాలలో అసంపూర్తిగా నిలిచిన పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు అదేవిధంగా జల్ జీవన్ మిషన్ పనులు కాంట్రాక్టులు కూడా సొరవ తీసుకొని త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు అదేవిధంగా ఆర్డబ్ల్యూఎస్ అధికారులును గ్రామములో సమస్యలను అడిగి తెలుసుకున్నారు గ్రామంలోపి చిన్న సమస్య వచ్చిన వెంటనే అధికారులు పరిష్కరించే విధంగా ఉండాలని సూచించారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ఇంచార్జ్ విశ్వక్షణ జిల్లా మాజీ డిపి అధ్యక్షులు చౌదరి బాబ్జి ఎచ్చర్ల నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ లంక శ్యామలరావు పిస్నింటి బానోజీ నాయుడు పిసిని జగన్నాథం తదితరులు పాల్గొన్నారు

# జివిఎంసి "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో 108 వినతులు : జివిఎంసి కమిషనరు కేతన్ గార్గ్

విశాఖపట్నం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో జీవీఎంసీ లో అన్ని విభాగాలకు కలిపి 108 వినతులు వచ్చాయని జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. సోమవారం ఆయన జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కమిషనర్లు పి.నల్లనయ్య, ఎస్.ఎస్.వర్మ లతో కలసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమానికి జివిఎంసికి సంబంధించి 108 అర్జీలు / ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని తెలిపారు. అందులో ముఖ్యంగా భీమిలి జోన్ కు 03, మధురవాడ జోన్ కు 13, ఈస్ట్ జోన్ కు 20, వెస్ట్ జోన్ కు 07, నార్త్ జోనుకు 16, సౌత్ జోన్ కు 11, పెందుర్తి జోన్ కు 11, గాజువాక జోన్ కు 07, జివిఎంసి ప్రధాన కార్యాలయానికి 20 ఫిర్యాదులు అందాయని తెలిపారు. జోనల్ అడ్మినిస్ట్రేషన్ కు 04, జివిఎంసి అడ్మినిస్ట్రేషన్ ఉ అకౌంట్సు విభాగమునకు 09, రెవెన్యూ విభాగమునకు 11, ప్రజారోగ్య విభాగమునకు 06, పట్టణ ప్రణాళిక విభాగమునకు 52, ఇంజినీరింగు విభాగమునకు 22, డిడిహెచ్ విభాగమునకు 02, యుసిడి విభాగమునకు 02 కలిపి మొత్తంగా 108 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. ఫిర్యాదులకు సంబంధించిన విభాగాధిపతులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను/ ఫిర్యాదులను అదే రోజు జోనల్ స్థాయి అధికారులు వెంటనే పరిశీలిస్తూ, సంబంధిత ఫిర్యాదు దారులతో సంప్రదించి నిర్ణీత సమయంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీలపై అధికారులు వెంటనే స్పందించి కార్యాచరణ అదే రోజు చేపట్టాలని, ప్రతివారం అదే ఫిర్యాదులు తిరిగి ప్రజలు సమర్పించకుండా ఆయా సమస్యలను నిర్ణీత సమయం లో పరిష్కరించాలని జివిఎంసి జోనల్ కమీషనర్లను, అధికారులను కమిషనర్ ఆదేశించారు. పురమిత్ర, PGRSలో నమోదైన పిర్యాదులను కూడా అధికంగా పెండింగ్ లో ఉన్నాయని వాటిని పరిశీలించాలన్నారు. జోనల్ కమీషనర్ లు, జోనల్ అధికారులు నిత్యం మధ్యాహ్నం 3 నుండి 5 వరకు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ (అమృత్) డి.విజయ భారతి, డి సి ఆర్ ఎస్.శ్రీనివాసరావు, ప్రధాన వైద్యాధికారి ఇన్చార్జి డాక్టర్ కృష్ణంరాజు, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యుసిడి) బి.వి.రమణ, ఎగ్జామినర్ ఆఫ్ ఎకౌంట్స్ సి.వాసుదేవ రెడ్డి, పర్యవేక్షక ఇంజనీర్లు, యుసిడి డిపిఒ లు జి.నాగార్జునరావు, శాంత కుమారి, డిసిపి లు, ఎసిపి లు, బయాలజిస్ట్ సాంబమూర్తి, స్టాటిస్టికల్ అధికారి పి డి వి ప్రసాద్, డిడిహెచ్ వాసుకి, ఎకౌంట్స్ ఆఫీసర్ నారాయణరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి.పద్మజ, అన్ని విభాగాల సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఊర్వశి జంక్షన్ నవత గ్రౌండ్ లో అగ్నిప్రమాదం



విశాఖపట్నం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) : జీవీఎంసీ 54 వ వార్డు ఊర్వశి జంక్షన్ మెయిన్ రోడ్ నవత గ్రౌండ్లో సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడం తో స్థానికులు అగ్రిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పారు. ఈ ఘటనలో గ్రౌండ్ చుట్టుపక్కల ఉన్న కేబుల్స్, చెట్ల కొమ్మలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఎవరికి ఏ విధమైన ప్రాణహాని జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

# నేడు జాతీయ విచారణ సంస్థ (ఎన్.ఐ.ఏ) ప్రత్యేక ట్రయల్ కోర్టు ప్రారంభం

విశాఖపట్నం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) : ఈ నెల 22న జాతీయ విచారణ సంస్థ (ఎన్.ఐ. ఏ) ప్రత్యేక ట్రయల్ కోర్టును వర్చువల్ గా ప్రారంభించ నున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ తెలిపారు. ఈ ప్రత్యేక ట్రయల్ కోర్టు ను హై కోర్టు జడ్జి మరియు విశాఖపట్నం అడ్మినిస్ట్రేటివ్ జడ్జి అయిన జస్టిస్ బట్టు దేవానంద్ , హై కోర్టు జడ్జి జస్టిస్ రవి చీమలపాటి మంగళవారం సాయంత్రం 5 గంటలకు వర్చువల్ గా ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం జిల్లా ప్రధాన న్యాయమూర్తి మరియు విశాఖపట్నం బార్ అసోసియేషన్ వారి ఆధ్వర్యం లో జరుగుతుందని పేర్కొన్నారు.

# ఆకర్షణీయమైన డిజైన్‌తో ఏఐ ప్లస్ నోవా 2 పవర్




**విశాఖపట్నం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్, తన నోవా 2 సిరీస్‌లో భాగంగా, తాజా స్మార్ట్‌ఫోన్ అయిన నోవా 2 పవర్ 5 జీ ని లాంచ్ చేసింది. అత్యాధునిక డిజైన్, విశ్వసనీయమైన పనితీరు, ఎక్కువకాలం నిలిచే బ్యాటరీ పవర్‌ను కలిపి, టెక్నాలజీపై ఆసక్తి ఉన్న కొత్త తరం వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని ఈ ఫోన్‌ను రూపొందించారు. సాంప్రదాయ స్మార్ట్‌ఫోన్ లాంచ్‌లకు భిన్నంగా, ఫ్యాషన్ మరియు టెక్నాలజీల అద్భుత సమ్మేళనాన్ని ప్రదర్శిస్తూ, నోవా 2 పవర్ న్యూఢిల్లీలోని రన్‌వేపై ఆవిష్కరించారు. ఈ ఫోన్‌ను ఆధునిక రన్‌వే లుక్స్‌తో సమన్వయం చేసి ప్రదర్శించడం ద్వారా, ఇది కేవలం ఒక టెక్నాలజీ పరికరం మాత్రమే కాకుండా స్టైలిష్ యాక్సెసరీగా కూడా ఉంటుందనే భావనను హైలైట్ చేశారు. స్ఫూర్తినిచ్చే డిజైన్. ఎక్కువకాలం నిలిచే పవర్," అనే మంత్రంతో రూపొందించిన నోవా 2 పవర్‌లో, స్మార్ట్‌ఫోన్ అనుభవంలో డిజైన్‌కు ప్రాధాన్యత ఇస్తూనే, వినియోగదారులు కోరుకునే పనితీరు మరియు మన్నికను అందించారు.

**టెక్నాలజీ మరియు ఫ్యాషన్ కలిసే చోటు**

స్మార్ట్‌ఫోన్‌లు వ్యక్తిగత గుర్తింపులో భాగంగా మారుతున్న నేపథ్యంలో, నోవా 2 పవర్ కేవలం పనితీరుకే పరిమితం కాకుండా వ్యక్తిత్వాన్ని ప్రతిబింబించే పరికరంగా నిలుస్తుంది. డిజైన్, ఆకాంక్ష మరియు టెక్నాలజీల కలిసే కేంద్రంగా స్మార్ట్‌ఫోన్‌ను నిలపాలనే ఏఐం స్మార్ట్‌ఫోన్ దార్శనికతను ఈ రన్‌వే ప్రదర్శన హైలైట్ చేస్తుంది. ఈ ఫోన్ ముఖ్య ఫీచర్లలో ఆకర్షణీయమైన డ్యూయల్ టోన్ బ్యాక్ ప్యానెల్ ఆకర్షణీయమైన డ్యూయల్-టోన్ బ్యాక్ ప్యానెల్ ఒకటి. ఇది కలర్ ఫ్యూజన్ ఫినిషింగ్స్‌లో లభిస్తుంది: బ్లూ గోల్డ్ ఫ్యూజన్ మరియు బ్లూ ఫ్యూజన్‌తో పాటు, ఓషన్ గ్రీన్, డీప్ పర్పుల్ మరియు మిడ్‌నైట్ బ్లాక్ రంగులలో కూడా అందుబాటులో ఉంది. కాంతి పడే విధానాన్ని బట్టి ప్రతి రంగు ప్రత్యేకంగా మెరుస్తూ, ఒక ప్రత్యేకమైన శోభను జోడిస్తుంది. రన్‌వే ప్రదర్శనలో, నోవా 2 పవర్‌ను జస్ట్ బిల్లీ బై రష్మీ ఛబ్రా రూపొందించిన అథ్లెజర్ దుస్తులతో స్టైల్ చేశారు. తద్వారా, ఈ ఫోన్‌ను ఫ్యాషన్‌లో భాగమైన యాక్సెసరీగా ప్రదర్శించారు. నెక్స్ట్‌క్వాంటమ్ షిఫ్ట్ టెక్నాలజీస్ (ఏఐ ప్లస్ స్మార్ట్‌ఫోన్) సీఈఓ మాధవ్ షెత్ మాట్లాడుతూ "ఈ రోజుల్లో, టెక్నాలజీ అనేది వ్యక్తిగతమైనది. ఒక స్మార్ట్‌ఫోన్ కేవలం ఫంక్షనల్ పరికరం మాత్రమే కాదు; అది వ్యక్తులు తమను తాము వ్యక్తీకరించుకునే ఒక సాధనం. నోవా 2 పవర్‌లో డిజైన్‌తో పాటు పనితీరుకు కూడా సమాన ప్రాధాన్యత ఇచ్చాం. దీని ఆకర్షణీయమైన కలర్ ఫ్యూజన్ డిజైన్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది, అదే సమయంలో దీనిలోని అంతర్గత పవర్ రోజువారీ జీవితానికి తోడ్పడుతుంది. టెక్నాలజీ, డిజైన్ మరియు వ్యక్తిగత వ్యక్తీకరణ కలిసే ఈ పరికరాన్ని రన్‌వేపై లాంచ్ చేయండి ఒక సరైన ఎంపిక. అన్నారు.

# అరకు - గుంటసీమ వరకు ఇప్పటివరకు బస్సు సర్వీసును "కుజబంగి" వరకు పొడిగిస్తూ, బస్సు ను ప్రారంభించిన విజయనగరం జోన్ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దున్నదొర



**ఎఎస్ఆర్ జిల్లా, పాడేరు / అరకువ్యాలీ , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ డిపో పాడేరు డిపో, నుండి కుజబంగి వరకు పొడిగించిన నూతన బస్సు సర్వీస్ ను ప్రారంభించిన విజయనగరం జోన్ ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ సియారీ దున్నదొర. ఈ సందర్భంగా ఆర్టీసీ చైర్మన్ మాట్లాడుతూ నూతన బస్సు సర్వీస్ వల్ల ప్రయాణికులు, ఉద్యోగులు,వ్యాపారస్తులు,విద్యార్థుల విజ్ఞప్తి మేరకు, పాడేరు డిపో నుండి అరకు -గుంటసీమ వరకు ఇప్పటివరకు నడుస్తున్న బస్సు సర్వీసును "కుజబంగి" వరకు పొడిగిస్తూ నూతన బస్సు సర్వీసును ఈరోజు ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ సదవకాశన్ని చుట్టుప్రక్కల ప్రాంత ప్రయాణికులు, ఉద్యోగులు, వ్యాపారస్తులు, విద్యార్థులు ఈ నూతన బస్సు సర్వీసును సద్వినియోగం చేసుకొని, పాడేరు డిపో ఆర్టీసీ అభివృద్ధికి తోడ్పడగలరని పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వం అందిస్తున్న శ్రీ శక్తి పథకం స్త్రీ లకు ఎంతో ప్రయోజనకరంగా ఉందని, మనమంతా గౌరవం ముఖ్యమంత్రి వారికి ధన్యవాదాలు తెలియజేయాలని తెలిపారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఏ.పి.ఎస్.ఆర్.టి.సి. పాడేరు డిపో మేనేజర్ శ్రీ ఎన్. శ్యామ్ సుందర్ నాయుడు , డి.వి. శ్రీనివాస్ ఆఫీస్ సూపరింటెండెంట్, ఇతర సెక్షన్ ఇన్-ఛార్జీలు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ విభాగం అధికారులు, నేషనల్ మజ్దూర్ యూనియన్ (NMU) డిపో సెక్రటరీ S.R. బాబు , మరియు ఎంప్లాయీస్ యూనియన్ సెక్రటరీరావు , ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# 25న శ్లోక పాకల 'కూచిపూడి' నాట్య రంగప్రవేశం

**విశాఖపట్నం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** నగరానికి చెందిన యుక కూచిపూడి నర్తకి శ్లోక పాకల 'కూచిపూడి' నాట్య రంగప్రవేశం 25వ తేదీ శుక్రవారం సాయంత్రం కళాభారతి ఆడిటోరియంలో జరుగనుంది. భారత్ నృత్యోత్సవ్, వైశాఖి నృత్యోత్సవ్ వంటి ప్రామాణికమైన జాతీయ, అంతర్జాతీయ నృత్యోత్సవాల నిర్వహణతో నగర ఖ్యాతిని దశదిశలా వ్యాపింపజేస్తున్న ఐఎస్ఓ గుర్తింపు కలిగిన సంస్థ నటరాజ్ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడెమీ ప్రిన్స్‌పల్ నాట్యశ్రీ కేవీ లక్ష్మి శుష్రూషలో సుశిక్షితురాలైన శ్లోక గీతం డీమ్డ్ టుబి యూనివర్సిటీలో బి.టెక్ (సి.ఎస్.ఈ) చివరి సంవత్సరం విద్యార్థిని. అంతేకాకుండా ఆమె ఎన్‌సీసీ క్యాడెట్ చదువులోనూ ముందంజలో ఉంటుంది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది అనే సామెతకు ఆమె జీవితం అద్దం పడుతుంది. అతి పిన్న వయస్కురాలిగా బుడిబుడి అడుగుల నాడే శ్లోక నాట్యంలో ఓనమాలు దిద్దడం ఆరంభించారు. శాస్త్రీయ నృత్యాన్ని అభ్యసించడం, ఆకళింపు చేసుకోవడంలో ఆమెది మూడు



తరాల అనువంశిక వారసత్వం. తల్లి వైజయంతి పాకల 14 ఏళ్లపాటు నిరఘాటంగా టేకుమళ్ల శ్యామల వద్ద కూచి పూడి నాట్యం నేర్చుకున్నారు. ఆమె అమ్మమ్మ శశికళ పెద్దాడ కూడా అంకితభావం కలిగిన కూచిపూడి నాట్యకారిణి. ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా తిలకించి యువ నాట్యకారిణి శ్లోకను ఆశీర్వదించడానికి దేశం నలు చెరగుల నుంచి సంగీత నాటక అకాడెమీ అవార్డు, పద్మశ్రీ పురస్కార విజేతలైన ప్రఖ్యాత నర్తకీ విదుషీమణులు హాజరుకానున్నారు. మణిపురీ నాట్య శిఖరం డాక్టర్ దర్శనా ఝవేరీ, డాక్టర్ కళా కృష్ణ , కళారత్న హరి రమమమూర్తి, తదితరులు రానున్నారు.

దేశంలో పేరెన్నికగన్న నృత్యోత్సవ నిర్వాహకులు సాయి వెంకటేష్, అనుపమా మోహన్, డాక్టర్ పి. రమాదేవి, డాక్టర్ సజనీ వల్లభనేని, చిత్రా సుకుమారన్, ఎం. భారతి, ప్రొఫెసర్ సుదీప్త, రైటర్స్ అకాడెమీ ఛైర్మన్ వి.వి. రమణ మూర్తి అతిథులుగా పాల్గొంటారు. కళాప్రియులంతా సకాలంలో తమ మొబైల్ ఫోన్లను నిశ్శబ్దంలో ఉంచి ప్రదర్శనకు ఎటువంటి ఆటంకం కలుగకుండా చూడాలని ఎన్ఎండీఏ వ్యవస్థాపక అధ్యక్షులు ద డ్యాన్స్ ఇండియా ఆంగ్ల సాంస్కృతిక మాసపత్రిక సంపాదకులు బిఆర్ విక్రమ్ కుమార్ సూచించారు.

# వైశ్యుల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉంది

## వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకటరావు సవాల్

**శ్రీకాకుళం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** రాష్ట్రంలోని వైశ్యుల సంక్షేమం, అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి పనిచేసిందని వైశ్య కార్పొరేషన్ నాయకులు స్పష్టం చేశారు. వైశ్యుల సంక్షేమంపై తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని వారు సూచించారు. 2014--19 మధ్యకాలంలో నాటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, బోయిన గోవిందరావు సారథ్యంలో కళింగ వైశ్యులకు బీసీ సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకున్నామని వారు గుర్తుచేశారు. ఈ సందర్భంగా కళింగ వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ జామి వెంకట్రావు మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైశ్యులకు ఇచ్చిన పలు హామీలు అమలు కాలేదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ హోదా కల్పిస్తామని చెప్పి ఆ హామీని నెరవేర్చలేదని విమర్శించారు. ప్రస్తుతం మళ్లీ వైశ్యులను మభ్యపెట్టేలా తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. వైసీపీ వైశ్య నాయకులకు వారు సవాల్ విసిరారు. తమ హయాంలో వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు కోసం విజయవాడ నుంచి ప్రభుత్వ పెద్దలను కలిసి, నిరంతరం పోరాటం చేసి జీవోలు, సంక్షేమ కార్యక్రమాలు సాధించామని తెలిపారు. "మా హయాంలో వైశ్యుల కోసం తీసుకున్న నిర్ణయాలకు సంబంధించిన జీవో కాపీలతో బహిరంగ చర్చకు మేము సిద్ధంగా ఉన్నాం. వైసీపీ ప్రభుత్వ హయాంలో వైశ్యుల కోసం ఏం చేశారో ఆధారాలతో నిరూపించగలరా?" అని వారు ప్రశ్నించారు.

# రోడ్ల విస్తరణ, సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యం : ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి




**వి. మాడుగుల , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** మండల సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా అడుగులు ముందుకు వేస్తున్నామని మాడుగుల నియోజకవర్గ శాసనసభ్యులు బండారు సత్యనారాయణమూర్తి స్పష్టం చేశారు. సోమవారం వి. మాడుగుల మండల కేంద్రంలో ఎంపీపీ రాజారాం అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సమావేశంలో వివిధ శాఖల ప్రగతిని క్షుణ్ణంగా సమీక్షించిన ఎమ్మెల్యే, అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ప్రధానంగా రోడ్ల విస్తరణపై చర్చ జరిగింది. పాడేరు రహదారి నుంచి శంకరం రోడ్డును కలుపుతున్న ప్రస్తుత 6 మీటర్ల మార్గాన్ని, 9 మీటర్లుగా వెడల్పు చేసేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయగా, కొందరు స్థానికులు అడ్డంకులు సృష్టించడాన్ని సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బండారు, తహశీల్దార్‌ను తక్షణమే ఘటనా స్థలానికి వెళ్లి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల రవాణా సౌకర్యార్థం ఈ రహదారిని 9 మీటర్ల వెడల్పుతో నిర్మించి తీరాల్సిందేనని, ఇందులో ఎవరి అలసత్వం ప్రదర్శించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అంతేకాకుండా, కోటపాడు నుంచి పాడేరు వరకు సుమారు 76 కిలోమీటర్ల మేర హైవే రహదారి నిర్మాణానికి త్వరలోనే అనుమతులు రానున్నాయని, వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేయిస్తామని నియోజకవర్గ ప్రజలకు భరోసా ఇచ్చారు. వ్యవసాయ రంగానికి, సాగునీటి వసతి కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగా మండలంలో ఇప్పటివరకు అసంపూర్తిగా నిలిచిపోయిన తారకరామ, పొరగడ్డ, ఎర్రగడ్డ, ఆళ్లగడ్డ రిజర్వాయర్ల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టులు పూర్తైతే స్థానిక రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చి వ్యవసాయం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. అలాగే సమావేశంలో పింఛన్ల అంశంపై సభ్యుడు పెదబాబు ప్రస్తావించగా, ఎంపీడీవో వివరాలు వెల్లడించారు. మండలంలో ప్రస్తుతం మొత్తం 1,826 మందికి కొత్త పింఛన్లు అందుతున్నాయని తెలిపారు. కింతల గ్రామంలో మూడు పింఛన్ల తొలగింపుపై వస్తున్న విమర్శలపై పంచాయతీ కార్యదర్శి స్పష్టతనిస్తూ, లబ్ధిదారులలో ఒకరికి నాలుగు చక్రాల వాహనం ఉండగా, మరో ఇద్దరికి ప్రభుత్వ నిబంధనలకు మించి భూములు ఉన్నట్లు క్షేత్రస్థాయి విచారణలో తేలిందని, అందుకే నిబంధనల ప్రకారమే వాటిని తొలగించినట్లు సభకు వివరించారు. ప్రస్తుత మండల పరిషత్ పాలకవర్గానికి ఇదే చివరి సర్వసభ్య సమావేశం కావడంతో సమావేశం చివరిలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గత ఐదేళ్లపాటు తమ ప్రాంతాల ప్రజల సమస్యల పరిష్కారంలో, మండల అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించిన ఎంపీటీసీ సభ్యులందరినీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రమణమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, ఎంపీడీవో, తహశీల్దార్‌తో పాటు వివిధ శాఖల మండల స్థాయి అధికారులు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మెగా మెడికల్ క్యాంపునకు విస్తృత ఏర్పాట్లు

**శ్రీకాకుళం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** సేవా సంకల్పం కార్యక్రమంలో భాగంగా గౌరవ ప్రధానమంత్రి నరేంద్రమోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 22వ తేదీన శ్రీకాకుళం నందు మెగా మెడికల్ క్యాంపుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ, సంయుక్త సంచాలకులు, డాక్టర్ బి. రాజశేఖర్ తెలిపారు. శ్రీకాకుళం మొదటి అంతస్తు నందు గల సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో మెగా క్యాంప్ నిర్వహణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వైద్య ఆరోగ్య శాఖ, సంయుక్త సంచాలకులు, డాక్టర్ బి. రాజశేఖర్, డాక్టర్ ఇ.ఎన్.వి. నరేష్ కుమార్ , ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య శాఖ, సంయుక్త సంచాలకులు, డాక్టర్ బి. రాజశేఖర్, మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న మెగా మెడికల్ క్యాంపుకు వచ్చే రోగులకు ఎటువంటి అసౌకర్యము కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని సంభందిత సిబ్బందిని ఆదేశించారు. స్టాల్స్ ఏర్పాటు, త్రాగునీరు ,విద్యుత్ , భోజన తదితర సౌకర్యాలు కల్పించాలని, రోగుల కొరకు 108 వాహనాలను అందుబాటులో ఉంచాలని, హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి సూపర్వైజర్ పర్యవేక్షణలో అన్ని సక్రమంగా జరగాలని ఆదేశించారు. ఓపి రిజిస్ట్రేషన్లు, ఫోటోగ్రఫీ మరియు వీడియోగ్రఫీ ఏర్పాటు చేసి అధికారులందరూ సమన్వయంతో పనిచేసి మెగా క్యాంపును విజయవంతం చేయాలని కోరారు. ఈ క్యాంపులో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలకు స్పెషలిస్ట్ లతో వైద్య సేవలు అందించుట జరుగుతుందని, రిఫరల్స్ మరియు ఫాలో-అప్ సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఆసుపత్రి సామర్థ్యం మరియుూనిజ సేవలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు టార్గెట్ ను 5000 నుండి 2000 మందికి కుదించడం జరిగిందని ఒకేసారి 300 నుండి 400 మంది వరకు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆప్తాల్మాలజీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ తదితర విభాగాల ద్వారా సేవలందిస్తున్నట్లు తెలిపారు. నాన్-కమ్యూనికబుల్ వ్యాధులు (BP, షుగర్) పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలకు (3 నుండి 8 నెలలు) ూనిజ లలో నమోదైన వారికి ప్రత్యేకంగా యాంటీ నేటల్ చెకప్స్ కు హాజరయ్యే ప్రతి ఒక్కరికి ముందుగానేూదీనా రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలని అన్నారు. DMHO, ICDS, DHO, RVS మేనేజర్లు మండలాల వారీగా లైన్ లిస్ట్ సిద్ధం చేయాలన్నారు. గర్భిణీల తరలింపునకు ICDS, అంగన్వాడీ టీచర్లు బాధ్యత వహించాలని, రవాణా కోసం 108, 104 సేవలను వినియోగించుకోలని తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రిమ్స్ సూపరింటెంట్, ఎల్. ప్రసన్నకుమారి, అడిషనల్ డి ఎం అండ్ హెచ్ ఓ, డా. శ్రీకాంత్, ఆర్ .బి. ఎస్. కె/ ఎన్. సి. డి, డా. కె. శివరమణి, డి.పి.ఎమ్.ఓ, డాక్టర్ బి. రవీంద్ర, డి.ఎన్.ఎమ్.ఓ, డా. ప్రవీణ్, ఆర్ .ఎం. ఓ, డా. సుభాషిని, డా. శ్రీదేవి, డిప్యూటి.హెచ్.ఈ.ఓ,( మాస్ మీడియా) వి. మోహిని రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

## గురజాడకు తెలుగు శక్తి ఘన నివాళులు



**విశాఖపట్నం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** తెలుగు సాహిత్యంలో ఆధునిక యుగానికి ఆద్యుడు, గొప్ప సంఘ సంస్కర్త, నాటక రచయిత, కవి గురజాడ వెంకట అప్పారావు 164వ జయంతి సందర్భంగా విశాఖపట్నంలో ఆయనకు ఘన నివాళులు అర్పించారు. సోమవారం ఉదయం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని గురజాడ విగ్రహానికి తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురజాడ సాహిత్య సేవలను, సంఘ సంస్కరణలో ఆయన పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు.

ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ, 1862 సెప్టెంబర్ 21న విజయనగరం జిల్లాలోని రాయవరం లో జన్మించిన గురజాడ వెంకట అప్పారావు తెలుగు సాహిత్యానికి ఆధునిక దిశానిర్దేశం చేసిన మహనీయుడని పేర్కొన్నారు. "దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్" అంటూ దేశభక్తికి, మానవతావాదానికి కొత్త నిర్వచనం ఇచ్చిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. గురజాడ రచించిన 'కన్యాశుల్కం' నాటకం తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకుందని, సమాజంలోని దురాచారాలను, ముఖ్యంగా కన్యాశుల్కం వంటి సామాజిక దురాచారాలను ఎండగడుతూ ప్రజల్లో చైతన్యం కలిగించిందని రామ్ పేర్కొన్నారు. వ్యవహారిక భాషలో ఆధునిక భావాలను వ్యక్తీకరించి తెలుగు సాహిత్యానికి కొత్త ఒరవడిని తీసుకొచ్చారని తెలిపారు. 'పూర్ణమ్మ', 'కన్యక' వంటి ప్రసిద్ధ ఖండికలతో పాటు అనేక కథలను రచించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని గుర్తుచేశారు. గురజాడ రచనలు నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పప్పుర్ నికుంజ్ తదితరులు పాల్గొని గురజాడకు నివాళులర్పించారు

# పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి : అచ్చెన్నాయుడు

## కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినరాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ):** పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం కోటబొమ్మాళి మండలం ఎన్టీఆర్ భవన్ వద్ద నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలోని 38 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి చేతుల మీదుగా పంపిణీ చేశారు.




### 480 మంది లబ్ధిదారులకు ..రూ.4.81 కోట్లు సాయం

గత రెండున్నరేళ్లలో నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం 592 మంది దరఖాస్తు చేసుకున్నారని మంత్రి తెలిపారు. ఇప్పటివరకు 480 మందికి మంజూరు చేసి చెక్కులు పంపిణీ చేసినట్లు చెప్పారు. మరో 100కు పైగా దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, మరో 10--15 రోజుల్లో వాటిని కూడా పరిష్కరించి చెక్కులు అందిస్తామని వెల్లడించారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ కింద రూ.4.81 కోట్లను పేదలకు అందించినట్లు తెలిపారు.

### సిఫారసు అవసరం లేదు.. ఒక్క పైసా ఖర్చు చేయొద్దు

ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా లబ్ధి పొందేందుకు ఎవరూ సిఫారసు చేయాల్సిన అవసరం లేదని, ఒక్క పైసా ఖర్చు చేయాల్సిన అవసరం లేదని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. అవసరమైన పత్రాలతో కార్యాలయానికి దరఖాస్తు చేస్తే చెక్‌లిస్ట్ ప్రకారం పత్రాలను స్వీకరించి, పరిశీలన అనంతరం సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాల్లో వైద్య సహాయం అవసరమైన వారికి ఈ విషయాన్ని తెలియజేసి దరఖాస్తు చేయించాలని కోరారు.

### అర్హతే ప్రాతిపదికగా ఇళ్ల మంజూరు

సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి తెలిపారు. అర్హులైన వారికి పింఛన్లు, ఇళ్ల మంజూరు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. రాష్ట్రానికి మూడు లక్షల ఇళ్లు మంజూరయ్యాయని, ప్రతి నియోజకవర్గానికి సుమారు 10 వేల ఇళ్లు అందేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఇళ్ల ఎంపికలో రాజకీయాలకు తావులేకుండా అర్హతనే ప్రాతిపదికగా తీసుకుంటామని స్పష్టం చేశారు.

### రూ.640 కోట్లతో తాగునీటి పథకం

నియోజకవర్గంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రూ.640 కోట్లతో మంచినీటి పథకాన్ని చేపట్టినట్లు మంత్రి తెలిపారు. హిరమండలం రిజర్వాయర్ నుంచి టెక్కలి నియోజకవర్గంలోని 365 గ్రామాలకు తాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించామని, ఏడాదిన్నరలో ఈ పథకాన్ని పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. వర్షాభావ పరిస్థితుల్లో రైతులకు సాగునీరు అందించేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలకు నిధులు మంజూరు చేశామని, అవసరమైన చోట కొత్త పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కూడా పెద్దపీట వేస్తున్నామని, ప్రతి గ్రామానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యమన్నారు.నేరడి బ్యారేజీకి అవసరమైన క్లియరెన్స్‌లు సాధించామని, అంచనాలు సిద్ధమయ్యాయని మంత్రి తెలిపారు. త్వరలో టెండర్లు పిలిచి పనులు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నేరడి బ్యారేజీ పూర్తయితే వంశధార జలాలను సమర్థంగా వినియోగించుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

### మూడు సంవత్సరాల్లో మరింత అభివృద్ధి

నియోజకవర్గంలో రాబోయే మూడేళ్లలో నియోజకవర్గ అభివృద్ధిని మరింత వేగవంతం చేసి, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమని అచ్చెన్నాయుడు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, నాలుగు మండలాల లబ్ధిదారులు, తదితరులు , పాల్గొన్నారు,

### ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా లబ్ధిపొందిన వారి వివరాలు

పొదిలపు నర్సింహులు కోటబొమ్మాళి మండలం చిట్టివలస గ్రామం -5,00,000,2. గురువెల్లి శివయ్య, కోటబొమ్మాళి మండలం కమలానాభపురం గ్రామం - 14,795,3. పడాల సన్యాసి, కోటబొమ్మాళి మండలం పెద్దబమ్మిడి గ్రామం - ?91,258, బొడ్డుబారికోడు, కోటబొమ్మాళి మండలం చీపురుపాడు గ్రామం - ?20,524, నంబారి తులసి రావు, కోటబొమ్మాళి మండలం యలమంచిలి గ్రామం - ?31,395, మామిడి రామయ్య జ/శీ ఆదిలక్ష్మి, కోటబొమ్మాళి మండలం యలమంచిలి గ్రామం - ?2,50,000, అంగ భుజంగారావు, కోటబొమ్మాళి మండలం తార్లిపేట గ్రామం - ?55,185 . కొర్ని వరలక్ష్మి, కోటబొమ్మాళి మండలం కోటబొమ్మాళి గ్రామం - ?53,734,. తంగి పారమ్మ, కోటబొమ్మాళి మండలం తాటిపర్తి గ్రామం - ?40,688,జామి సంతోష్ కుమార్, కోటబొమ్మాళి మండలం గోపాలపురం గ్రామం - ?20,000 పంగ ఉమ, కోటబొమ్మాళి మండలం తాటిపర్తి గ్రామం - 22,000, కోనారి మల్లమ్మ, కోటబొమ్మాళి మండలం పట్టుపురం గ్రామం - 37,380, పుక్కళ్ల ఈశ్వరమ్మ, సంతబొమ్మాళి మండలం ఉమిలాడ గ్రామం - 40,995 అందవరపు విశ్వేశ్వరరావు, సంతబొమ్మాళి మండలం డీజీ పురం గ్రామం - 75,734, కొండన లైలా , సంతబొమ్మాళి మండలం బోరుబద్ర గ్రామం - 4,04,932, గుడ్ల రాజని, సంతబొమ్మాళి మండలం బోరుబద్ర గ్రామం - 1,30,158 కరజాడ కొండయ్య, సంతబొమ్మాళి మండలం బోరుబద్ర గ్రామం - ?25,655, బేబీ ఆఫ్ గోరుసు రాజు, సంతబొమ్మాళి మండలం జి.గోవిందరావు ఁ నౌపడ గ్రామం - ?97,306, దండుపాటి రాములు, సంతబొమ్మాళి మండలం లక్కివలస గ్రామం - ?25,166, తుంబల దాలయ్య, సంతబొమ్మాళి మండలం లక్కివలస గ్రామం - ?11,101, మంకు కర్రయ్య, సంతబొమ్మాళి మండలం లక్కివలస గ్రామం - ?37,500, యెరుపిల్లి రవికుమార్, సంతబొమ్మాళి మండలం దెప్పలివానిపేట, మలగాం గ్రామం - 30,795, వాన నవీన్, సంతబొమ్మాళి మండలం శ్రీకృష్ణాపురం, పాలతలగాం గ్రామం - 33,200, రత్నాల అనిల్ కుమార్, సంతబొమ్మాళి మండలం చిన్నతుంగాం గ్రామం - ?13,101 సకలభక్తుల కృష్ణారావు, సంతబొమ్మాళి మండలం సంతబొమ్మాళి గ్రామం - ?31,795, బేబీ ఆఫ్ కె. నిర్మల, సంతబొమ్మాళి మండలం భవనపాడు గ్రామం - ?3,20,076, గొరకల ఆదినారాయణ, సంతబొమ్మాళి మండలం భవనపాడు గ్రామం - ?7,50,000,. చొక్కర రోసిని, సంతబొమ్మాళి మండలం చొక్కర రాంబాబు ఁ చినమరువాడ గ్రామం - ?1,70,000,. ఏడి సావిత్రి, టెక్కలి మండలం తిర్లంగి గ్రామం - ?51,942, బేబీ ఆఫ్ రాపర్తి కళ్యాణి, టెక్కలి మండలం తిర్లంగి గ్రామం - ?47,084, పట్నాన సంతోష్, టెక్కలి మండలం బూరాగాం గ్రామం - ?1,37,668 దేశెట్టి చిన్నమ్ములు, టెక్కలి మండలం సాసనం గ్రామం - ?62,344, తెలుగు సరస్వతి, టెక్కలి మండలం అక్కయ్యవలస గ్రామం - ?53,180,. చల్ల తిరుపతి రావు (ఐమ్ఫ్ష్ట్ర) జ/శీ భానుమతి, టెక్కలి మండలం చల్ల ప్రకాశరావు ఁ చల్లపేట గ్రామం - ?2,50,000, కొప్పల మోహన్‌రావు, నందిగాం మండలం దేవుపురం గ్రామం - ?1,49,351 బుడ్డ కామేశ్వరరావు, నందిగాం మండలం ముంద్రవలస గ్రామం - ?71,919,. తమ్మినాన సిద్దు సాయి, నందిగాం మండలం హరిదాసుపురం గ్రామం - ?96,899, తుంగాన జగ్గా రావు, నందిగాం మండలం పెద్దవలస, పాలవలస గ్రామం - ?1,36,753 చెక్కలు అందజేశారు,

## జనసేన కార్యాలయంలో గురజాడ 164వ జయంతి

**అనకాపల్లి , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ):** తెలుగు సాహితీ లోకానికి, అభ్యుదయ కవితా పితామహుడు, మహాకవి గురజాడ అప్పారావులి 164వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ముందుగా మహాకవి గురజాడ అప్పారావు గారికి అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జి భీమరశెట్టి రామ్కి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో రామ్ కి మాట్లాడుతూ..మహాకవి గురజాడ అప్పారావు 164వ జయంతి. లోక్ సత్తా పార్టీ అధ్యక్షులు బీశెట్టి బాబ్జి కృషితో రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రకటించిందని తెలియజేశారు .మహాకవి గురజాడ అప్పారావు మన అనకాపల్లి జిల్లా బిడ్డ కావడం మనందరికీ గర్వకారణం. 1862 సెప్టెంబర్ 21న రాయవరం గ్రామంలో జన్మించి, తెలుగు సాహిత్యంలో వాడుక భాషకు పట్టం కట్టిన మహనీయుడు. పూర్ణమ్మ, ముత్యాలసరాలు సారంగధర, కన్యాశుల్కం వంటి కాలజయ నాటకం ద్వారా బాల్య వివాహాలు, కన్యాశుల్క దురాచారంపై సమరం చేసిన సంఘ సంస్కర్త అని అన్నారు.దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్‌లి అని వందేళ్ల క్రితమే చాటిచెప్పిన ఆయన భావజాలం కొనియాడారు. తెలుగు భాష గొప్పతనాన్ని, గురజాడ రచనల్లోని గిరీశం, మధురవాణి వంటి పాత్రల నేటి యువతరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందని, ప్రతి విద్యార్థి కన్యాశుల్కం నాటకాన్ని, పూర్ణమ్మ కథను చదవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# గ్రీవెన్స్ కి 220 వినతులు : కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



**శ్రీకాకుళం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా అందిన ప్రతి వినతిని అధికారులు ప్రాధాన్యతతో స్వీకరించి, నాణ్యత, పారదర్శకతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హరి ఓం పాండియా ,డిఆర్ఓ విశ్వేశ్వరరావు తో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా క్షేత్రస్థాయి విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం చేయాలని సూచించారు. ఈ వేదికలో జిల్లా వ్యాప్తంగా మొత్తం 220 ఫిర్యాదులు నమోదయ్యాయని తెలిపారు. ఈ వినతుల్లో అత్యధికంగా రెవెన్యూ (సీసీఎల్ఏ) శాఖకు సంబంధించి 76 అర్జీలు రాగా, పంచాయతీ రాజ్ శాఖకు 35, సెర్ప్ విభాగంలో 19, స్వర్ణ గ్రామం - స్వర్ణ వార్డు పరిధిలో 18, సర్వే సెటిల్‌మెంట్స్ శాఖకు 16 వినతులు అందాయి. వీటితో పాటు జలవనరులు, విద్యుత్ శాఖ (ఈపీడీసీఎల్), పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, సమగ్ర శిక్ష, పాఠశాల విద్య, గృహ నిర్మాణ సంస్థ, వైద్య విద్య, పోలీసు, గ్రామీణ నీటి సరఫరా తదితర మొత్తం 28 వివిధ విభాగాలకు చెందిన ఫిర్యాదులు దాఖలయ్యాయి. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని, అధికారులు గ్రీవెన్స్ ఆడిట్‌ను సమర్థవంతం గా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ జోషిలా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లావణ్య ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అనధికార బాణాసంచా తయారీ, నిల్వపై కఠిన చర్యలు : డీఎస్పీ



**అనకాపల్లి , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు బాణాసంచా తయారీ, నిల్వ కేంద్రాలలో అనకాపల్లి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఈ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో అనకాపల్లి టౌన్ సీఐ ప్రేమ కుమార్, అనకాపల్లి రూరల్ సర్కిల్ సీఐ అశోక్ కుమార్, రూరల్ ఎస్సై రవికుమార్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి టౌన్ పరిధిలోని గవరపాలెం, తోటాడ పరిసర ప్రాంతాలతో పాటు, రూరల్ పరిధిలోని రాజుపాలెం, వల్లూరు గ్రామాల్లోని బాణాసంచా తయారీ కేంద్రాలు, గోదాములను అధికారులు స్వయంగా పరిశీలించారు. నిల్వ ఉంచిన పేలుడు పదార్థాలు, భద్రతా ప్రమాణాలు, అగ్నిమాపక పరికరాలు, లైసెన్సుల వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఈ.శ్రీనివాసులు గారు మాట్లాడుతూ: ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటాం. ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్ల మధ్యలో గానీ, జనావాసాల్లో గానీ బాణాసంచా తయారు చేసినా, అక్రమంగా నిల్వ ఉంచినా లేదా అమ్మకాలు చేపట్టినా వారిపై చట్టప్రకారం కఠిన కేసులు నమోదు చేస్తాం. ప్రభుత్వం నుంచి అధికారిక అనుమతులు (లైసెన్స్) పొందిన తయారీ, నిల్వ కేంద్రాల నిర్వాహకులు తప్పనిసరిగా నిర్దేశిత భద్రతా ప్రమాణాలు, నిబంధనలు పాటించాలి. నిల్వ కేంద్రాల వద్ద అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవడంతో పాటు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజల రక్షణే మా ప్రథమ ప్రాధాన్యం.” అనధికారికంగా బాణాసంచా నిల్వ ఉంచినా లేదా విక్రయాలు జరిపినా ప్రజలు డయల్ 112 లేదా స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# శ్రీశ్రీశ్రీ గౌరీ పరమేశ్వర ఆలయం వద్ద అన్న సమారాధన



**పెదగంట్యాడ , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** పెదగంట్యాడ దుర్గవానిపాలెం శ్రీశ్రీశ్రీ గౌరీ పరమేశ్వర ఆలయం వద్ద వినాయక పూజ మహోత్సవాలు 8వ రోజు సందర్భంగా సుమారు 5000 మందికి అన్న సమారాధన జరిగినది దీనికి ముఖ్యఅతిథిగా 74వ వార్డు మాజీ కార్పొరేటర్ తిప్పల వంశి రెడ్డి పాల్గొని ముందుగా గణపతిని పూజలు జరిపించి అన్న సమాఆరాధన ప్రారంభోత్సవం చేశారు వంశి రెడ్డి మాట్లాడుతూ నూతన 92వ వార్డు ప్రజలు దుర్గవానిపాలెం గ్రామ కమిటీ మహిళలు యువకులు గ్రామ పెద్దలు అందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో పిల్లాపాపలతో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని ఆ గణపతి దీవెనలు ప్రజలందరి పైన ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని అన్నారు

# నాణ్యమైన పరిశోధనలతో మెరుగైన అవకాశాలు

## యోగి వేమన విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య రాజశేఖర్

**ఆంధ్రవిశ్వవిద్యాలయం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** నాణ్యమైన పరిశోధనలతో మెరుగైన అవకాశాలు లభిస్తాయని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజ శేఖర్ అన్నారు. ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ మెథడాలజీ ఇన్ సోషల్ సైన్స్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సందర్భంగా ఆచార్య రాజ శేఖర్ మాట్లాడుతూ.... యువ స్కాలర్లందరూ మీ పిహెచ్‌డి థీసిస్‌తోనే తమ కెరీర్‌ను నిర్మించుకోవాలని సూచించారు. దానికి రీసెర్చ్ మెథడాలజీ అనేది చాలా కీలకమైనదన్నారు. పరిశోధన పత్రాల సంఖ్య కంటే వాటి నాణ్యత, ప్రచురించే జర్నల్ ఎంతో ప్రధానమన్నారు. పరిశోధకులు నిరంతరం ప్రేరణ, నిబద్ధత, ఉత్సాహం, కొత్త టూల్స్ నేర్చుకోవాలనే జిజ్ఞాస కలిగి ఉండాలని సూచించారు. సరైన పరిశోధన అంశాన్ని ఎంపిక చేసుకోవడం, కోర్స్ వర్క్‌ను పూర్తిచేయడం ఎంతో అవసరమన్నారు. రీసెర్చ్ సూపర్‌వైజర్ కేవలం ఒక సదుపాయకర్త మాత్రమేనని, మీ పరిశోధనను కేవలం సూపర్‌వైజర్ మార్గదర్శకత్వానికే పరిమితం చేయకుండా, మీ పరిశోధనా నాణ్యత దానికి మించి ఉండాలని సూచించారు.మన పరిశోధన అంశానికి అనుబంధంగానే మన పరిశోధన పత్రాలు ఉండాలన్నారు. క్వాంటిటేటివ్ రీసెర్చ్ పెరుగుతోందన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌ను పూర్తిగా విశ్వసించడం ఎంతమాత్రం సరికాదన్నారు. భవిష్యత్ తరానికి అవసరమైన ఉపాధ్యాయులను సిద్ధం చేస్తున్నామనే విషయం గుర్తుంచుకుని, కోర్స్‌వర్క్‌లో బోధనకు సంబంధించి టూల్స్, మెళకువలను భాగం చేయాలని సూచించారు. విద్యార్థులు బోధనా పద్ధతులు తెలియకుండానే నేరుగా ఆచార్యులు అయిపోవడం సరికాదన్నారు. థీసిస్ రాసేటప్పుడు, పద్ధతులు, మెళకువలను ఉపయోగించేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలన్నారు. సాంప్రదాయ పరిశోధన విధానాలకు అధునాతన సాంకేతికతను జోడిస్తూ మెరుగైన , పటిష్టమై, వైవిధ్యత కలిగిన పరిశోధనలు జరపాలని సూచించారు. ఏయూ వీసీ ఆచార్ జి.పి రాజశేఖర్ మాట్లాడుతూ...కాలపరీక్షకు నిలిచిన ప్రామాణికమైన, సాంప్ర దాయ పరిశోధనా పద్ధతులకు ఉప్పుడూ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీటిపై ముందుగా పూర్తి అవగాహన సాధించిన తర్వాతే ఆధునిక టూల్స్ వైపు వెళ్లాలని, లేని పక్షంలో మారుతున్న కాలంలో మనం వెనుకబడిపోతామన్నారు. సమయం వెచ్చించి లిటరేచర్ రివ్యూ చేయాలని, తరువాత మాత్రమే వ్యాసాలు రాయడం ప్రారంభించాలన్నారు. గుణాత్మకమైన, ఉన్నత ప్రమా ణాలు ఉన్న పరిశోధనలను లక్ష్యంగా పెట్టుకోకపోవా లన్నారు. పరిశోధనా లక్ష్యాలను ఎంపిక చేసుకునే సమయంలో సమగ్రమైన లిటరేచర్ రివ్యూ చేయాలని సూచించారు. విస్తృత అధ్యయనం తర్వాతే, ఒకదానికొకటి అనుసంధానమై ఉన్న లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ఆర్ట్స్ కళాశాల పరిధిలో పరిశోధకులకు ఉపయుక్తంగా, వారి సామర్థ్యాలను పెంపొందించే విధంగా ఇంటిగ్రేటెడ్ కెపాసిటీ బిల్డింగ్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జాలాది రవి మాట్లాడుతూ ఉన్నత విద్యా రంగంలో పరిశోధనా వాతావరణాన్ని బలోపేతం చేయడానికి, ఉన్నత ప్రమాణాలను నెలకొల్పడానికి ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఖీణూ) ని ఏర్పాటు చేసామన్నారు. కార్యక్రమానికి 200 కి పైగా దరఖాస్తులు రాగా, వివిధ ఉన్నత విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల నుండి 100 మంది ఫ్యాకల్టీ సభ్యులను ఎంపిక చేశామన్నారు. ఈ సుదీర్ఘ మేధోమథనంలో, నిపుణులు అందించే జ్ఞానాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలన్నారు. ఆధునిక పరిశోధనా పద్ధతులు, టూల్స్, అప్లికేషన్లపై పట్టు సాధించి, సామాజిక శాస్త్ర పరిశోధనా విధానాలలో కొత్త మార్గాలను అన్వేషించాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్‌ను సత్కరించి, జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల పరిధిలోని పలు విభాగాల ఆచార్యులు, అధ్యాపకులు, పరిశోధకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ ఆసుపత్రిలో నూతన క్రిటికల్ కేర్ బ్లాక్ ప్రారంభం

## శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తో కలసి లాంఛనంగా ప్రారంభించిన జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్



**అనకాపల్లి , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** పిఎం-ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ మిషన్ (పీఎం-ఏబీహెచ్ఐఎం) పథకం కింద రూ. 22.25 కోట్ల వ్యయంతో నిర్మించిన 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌ను కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డా మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ విధానంలో గత వారంలో ప్రారంభించారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేలా జిల్లా కలెక్టర్ శ్రీమతి విజయకృష్ణన్, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తో కలసి, ప్రత్యేక పూజలు నిర్వహించి సోమవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎన్టీఆర్ ఆసుపత్రిలో ప్రజలకు అందుతున్న వివిధ రకాల వైద్య సేవలను గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే ఆర్థోపెడిక్స్, జనరల్ సర్జరీ వంటి అత్యవసర వైద్య సేవలన్నింటినీ ప్రజలకు మరింత చేరువ చేసేలా తగిన ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక శాసనసభ్యులు కొనతాల రామకృష్ణ మాట్లాడుతూ.... కేంద్ర ఆరోగ్య శాఖ మరియు ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఈ నెల 17న వర్చువల్‌గా ప్రారంభమైన క్రిటికల్ కేర్ బ్లాక్ (జజదీ) సేవలను స్థానికంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం క్యాజువాలిటీ (అత్యవసర విభాగం) సేవలతో పాటు దాదాపు 10 ఐసీయూ (×జఖ) బెడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. రాబోయే రోజుల్లో సంపూర్ణ స్థాయి పరికరాలు, యంత్రాలు కేంద్రం నుండి రాగానే బెడ్ల సంఖ్యను 50 నుండి 60 వరకు పెంచనున్నట్లు తెలిపారు. ప్రధాన ఆసుపత్రిలోని ఓపీ (ర్గా) సేవలు, అత్యవసర విభాగాలను వేరు చేయడం ద్వారా రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా మెరుగైన వైద్యం అందిస్తారని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఇక్కడ ప్రత్యేక ఆక్సిజన్ యూనిట్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ప్రణాళికలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డి సి హెచ్ ఎస్., డా.శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.అచ్యుతకుమారి, వైద్యాధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సమాజ ఉద్ధరణకు కృషి చేసిన సాహితీవేత్త



**విశాఖపట్నం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన మహోన్నత సాహితీవేత్తల్లో గురజాడ అప్పారావు ప్రముఖులని జీవీఎంసీ అదనపు కమిషనర్లు ఎస్.ఎస్. వర్మ, పి. నల్లనయ్య పేర్కొన్నారు. గురజాడ అప్పారావు జయంతిని పురస్కరించుకుని సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్లు మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా సమాజ ఉద్ధరణకు విశేష కృషి చేసిన మహోన్నత సాహితీవేత్త అని కొనియాడారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో, సమాజానికి ఉపయోగపడే విధంగా ఆయన అనేక రచనలు చేశారని తెలిపారు. ముఖ్యంగా 'కన్యాశుల్కం' వంటి నాటకం ద్వారా ఆనాటి సామాజిక పరిస్థితులను, సామాజిక రుగ్మతలను ప్రజల ముందుకు తీసుకువచ్చారని పేర్కొన్నారు. అలాగే గురజాడ రచించిన "దేశమంటే మట్టికాదోయ్... దేశమంటే మనుషులోయ్" అనే గేయం తెలుగు ప్రజల హృదయాలను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. దేశం అంటే కేవలం భూభాగం కాదని, ప్రజలే దేశానికి మూలమనే గొప్ప సందేశాన్ని ఆయన తన రచనల ద్వారా అందించారని పేర్కొన్నారు. గురజాడ అప్పారావు తెలుగు సాహిత్యంలో అభ్యుదయ భావాలకు బలమైన పునాది వేసిన మహనీయుడని, ఆయనకు 'అభ్యుదయ కవితా పితామహుడు', 'కవి శేఖర' వంటి బిరుదులు లభించాయని తెలిపారు. సమాజంలో మార్పు కోసం సాహిత్యాన్ని ఒక సాధనంగా ఉపయోగించిన గురజాడ ఆశయాలు నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమని అన్నారు. అటువంటి మహోన్నత సాహితీవేత్త ఆశయాలను, ఆదర్శాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సమాజ అభ్యున్నతికి తమ వంతు కృషి చేయాలని అదనపు కమిషనర్లు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పద్మజత పాల్గొన్నారు

# బాలల హక్కులు, సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి

**శ్రీకాకుళం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** నేరారోపణలు ఎదుర్కొంటున్న, ఆపదలో ఉన్న బాలల హక్కుల పరిరక్షణతో పాటు వారికి సమర్థవంతంగా న్యాయ సహాయం, పునరావాసం అందించడంలో అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. హరిబాబు సూచించారు. స్థానిక శాంతినగర్ కాలనీలో ఉన్న జువెనైల్ జస్టిస్ బోర్డు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ కార్యాలయాలను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి మౌలిక సదుపాయాలు, బాలలకు అందుతున్న ఉచిత న్యాయ సహాయ సేవలు, వారిని కమిటీ ముందు హాజరు పరిచే విధానాలను అధికారులతో చర్చించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలల సంరక్షణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని, వారికి చట్టపరంగా అందాల్సిన ప్రతి రక్షణను వేగంగా అందించాలని హరిబాబు అధికారులను ఆదేశించారు.

# పెట్రోల్ బంకుల నిర్వహణ కొరకు గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుండి దరఖాస్తుల ఆహ్వానం

## సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ,పాడేరు ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ వెల్లడి



**ఏ.ఎస్.ఆర్.జిల్లా పాడేరు , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ(ఐ.టి.డి.ఎ),అనంతగిరి, లుంగాపుట్టు (ముంచింగిపుట్టు),పిట్టచలం(కొయ్యూరు) గ్రామంలో నెలకొల్పిన హెచ్.పి.సి.ఎల్ పెట్రోలు పంపుల నిర్వహణ కొరకు గిరిజన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ(ఐ.టి.డి.ఎ),పాడేరు ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ ఒక ప్రకటనలో తెలిపారు. అల్లూరి జిల్లా సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ(ఐ.టి.డి.ఎ),పాడేరు పరిదిలో గల స్థానిక గిరిజనులై తప్పనిసరిగా డిగ్రి అర్హత పొందిన, యువతి, యువకులు ఈ దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమం ముత్తం లాటరి పద్దతిలో ఎంపిక చేయడం జరుగుతుంది. ఎంపిక కాబడిన లీజుదారుడు పూర్తిగా నిర్వహణ కొరకు పెట్టుబడి పెట్టుకొవలసి ఉంటుంది. ముందుగా సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ(ఐ.టి.డి.ఎ),పాడేరు వారికి నిబంధనల ప్రకారం కొంత నగదు డిపాజిట్ చెల్లించాలి,అదేవిధంగా ప్రతి నెల అద్దె నిమిత్తం ఐ.టి.డి.ఎ, పాడేరు వారికి చెల్లించి పెట్రోలు బంక్ నిర్వహణ చేసుకోవలసి ఉంటుంది. దరఖాస్తు కొరకు ప్రాజెక్ట్ అధికారి ఐ.టి.డి.ఏ., పాడేరు వారి పేరు మీదుగా రూ.5000/-(అక్షరముల ఐదు వేలు రూపాయలు)డిమాండ్ డ్రాఫ్ట్(డిడి)ని ఇచ్చి ధరఖాస్తు పొందగలరు. అలాగే ధరఖాస్తు చేసుకోనె అభ్యర్ధి ధరఖాస్తుతో పాటు రూ.1,00,000/-(ఒక్క లక్ష రూపాయలు) బ్యాంకు డిమాండ్ డ్రాఫుట్ (డిడి) జువీణ ఇవ్వవలసి ఉంటుంది. ఎంపిక ప్రక్రియ పూర్తి అయిన వెంటనే ఎంపిక కాని అభ్యర్ధి యొక్క డిమాండ్ డ్రాఫుట్ (డిడి) జువీణ తిరిగి ఇవ్వబడును. ఆసక్తిగల వారు 21.09.2026 నుండి 28.09.2026 సాయంత్రం 5 గంటల వరకు ధరఖాస్తు చేసుకోవచ్చు అభ్యర్దుల ఎంపిక 01.10.2026న ఉదయం 11 గంటలకు లాటరీ పద్దతిలో ఎంపిక చేయబడును. ధరఖాస్తులు సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ(ఐ.టి.డి.ఎ),పాడేరు వారికీ కార్యక్రమం నాకు సమర్పించవలెను. ఇతర వివరాలు కొరకు 9440972048 ఈ ఫోన్ నెంబర్ కు సంప్రదించవలెను.

# వైభవంగా ప్రారంభమైన పవిత్రోత్సవాలు

## ఆలయ సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యం : ఈవో జల్లేపల్లి వెంకట్రావు



**సింహాచలం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** ప్రపంచ ప్రసిద్ధ సింహాచలం శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో పవిత్రోత్సవాలు సోమవారం వైభవంగా, ఆధ్యాత్మిక శోభతో ప్రారంభమయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో దేవస్థానం సంప్రదాయాలు, ఆగమ శాస్త్ర పద్ధతులకు అనుగుణంగా ఉత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. పవిత్రోత్సవాల తొలిరోజు అంకురార్పణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ స్థానాచార్యులు డాక్టర్ టి.పి. రాజగోపాల్, ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు, సీతారామాచార్యులు, అర్చక స్వాములు, వేద పండితుల ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ పవిత్ర ప్రతిష్ఠ, ఆవాహన తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు.

**పుట్టబంగారం సేకరణతో అంకురార్పణకు శ్రీకారం**

పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు లిపవిత్ర మృత్తిక (పుట్టబంగారం)లిను వెండి పళ్లెంలో ఉంచి శిరస్సున ధరించారు. మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రదక్షణ చేసి యాగశాలకు చేరుకున్నారు. అనంతరం మట్టి పాలికల్లో పవిత్ర మృత్తికను వేసి నవధాన్యాలను విత్తడంతో అంకురార్పణ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తులు "శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివారి కృపాకటాక్షం కలగాలి" అంటూ భక్తిశ్రద్ధలతో కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

**ఈవో ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు**

పవిత్రోత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయన ఆదేశాల మేరకు దేవస్థాన సిబ్బంది అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. సహాయ కార్యనిర్వహణాధికారి పిల్లా శ్రీనివాసరావు, పర్యవేక్షణ అధికారి కరోతి సూర్యనారాయణ కార్యక్రమాల నిర్వహణను పర్యవేక్షించారు. ఈ పవిత్ర కార్యక్రమంలో ఈవో జల్లేపల్లి వెంకట్రావు దంపతులు పాల్గొని స్వామివారిని సేవించి ఆశీస్సులు పొందారు. ఆలయంలో నిత్యం నిర్వహించే పూజలు, కైంకర్యాలు, ఉత్సవాల సమయంలో తెలియక సంభవించే దోషాలను పరిహరించి, ఆలయ పవిత్రతను పునరుద్ధరించడమే పవిత్రోత్సవాల ప్రధాన ఉద్దేశమని ఆలయ స్థానాచార్యులు డాక్టర్ టి.పి. రాజగోపాల్ తెలిపారు. ఈ వైదిక కార్యక్రమాలు ఆలయ సంప్రదాయాలు, ఆగమ విధానాలకు ప్రతీకగా నిలుస్తాయని, దేవస్థానానికి, భక్తులకు శుభఫలితాలు చేకూరాలని ఆకాంక్షించారు. పవిత్రోత్సవాలు ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని పవిత్రోత్సవాల ఆశీస్సులు పొందాలని దేవస్థానం అధికారులు కోరారు. ఈ పవిత్ర ఉత్సవాల లో భక్తులు దాతలు గంట్ల శ్రీనుబాబు, కేతిరెడ్డి సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు

# 25న డీ-వార్మింగ్ డేను పకడ్బందీగా నిర్వహించండి

## జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు



**విశాఖపట్నం , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** పిల్లల్లో నులిపురుగుల నిర్మూలన లక్ష్యంగా ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్న డీ-వార్మింగ్ డే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విశ్వేశ్వరనాయుడు అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రలు అందేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో డీ-వార్మింగ్ డే కార్యక్రమం అమలుపై సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల 5,74,496 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా అందించాలని ఆదేశించారు. పిల్లలు మధ్యాహ్న భోజనం చేసిన అరగంట తర్వాత ఆల్బెండజోల్ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి చిన్నారికి మాత్ర అందేలా విద్య, వైద్య, సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఒక వేళ 25న తీసుకోలేని పిల్లలకు అక్టోబర్ 5న నిర్వహించే మాప్‌అప్ రౌండ్‌లో తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు అందించాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. ఆర్. రమేష్, డీసీహెచ్ఎస్ డా. నరేంద్ర సింగ్, ప్రోగ్రాం ఆఫీసర్ డా. బి. హారికతో పాటు వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# 66వ వార్డులో ఘనంగా శ్రీ సిద్ధి వినాయక పూజ మహోత్సవం

## భారీ అన్న సమారాధన - ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ



**గాజువాక , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** 66వ వార్డులో శ్రీ శ్రీ శ్రీ సిద్ధి వినాయక పూజ మహోత్సవం సందర్భంగా భారీ అన్న సమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. శివాజీ నగర్ యూత్, కైలాష్ నగర్ లోని వినాయక నగర్ హౌస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మరియు కనితి రోడ్డులోని రేజింగ్ స్టార్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లి66వ వార్డు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ పాల్గొని ప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో వినాయక హౌస్ ఓనర్ వెల్ఫేర్ అసోసియేషన్ నుండి భాష్యం త్రినాథ్, ఎమ్మెస్ అప్పారావు, శంకర్ రావు, గంటా నారాయణరావు, పొన్నాడ రమణ, డాక్టర్ జగన్మోహన్, వేణు, మాజీ కౌన్సిలర్ రెడ్డి జగన్నాథం, స్వర్ణపూడి సత్యనారాయణ, గణేష్, నగేష్, కనితి రోడ్డులోని రేజింగ్ స్టార్ యూత్ నుండి సంతోష్, హేమంత్, చిన్న, సురేష్ రెడ్డి, గణేష్, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. వేలాదిమంది భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# దేవరాపల్లి పంచాయతీ పరిధిలోని అల్లిపురంలో ఘనంగా వినాయక నవరాత్రి మహోత్సవాలు

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు



**దేవరాపల్లి , సెప్టెంబర్ 21 ( మనం న్యూస్ ) :** దేవరాపల్లి పంచాయతీ పరిధిలోని అల్లిపురం గ్రామంలో వినాయక నవరాత్రి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గ్రామ యువత, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఉప ముఖ్యమంత్రి, మాడుగుల మాజీ ఎమ్మెల్యే బూడి ముత్యాల నాయుడు హాజరయ్యారు. ముందుగా ఆయన వినాయక మండపానికి చేరుకుని గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అనంతరం అన్న సమారాధన కార్యక్రమంలో పాల్గొని భక్తులతో కలిసి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా ముత్యాల నాయుడు మాట్లాడుతూ.. వినాయక నవరాత్రి ఉత్సవాలు గ్రామాల్లో భక్తి భావంతో పాటు ఐక్యతను పెంచుతాయని అన్నారు. అల్లిపురం గ్రామస్తులు ప్రతి ఏటా ఎంతో భక్తి శ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు, యువకులు, మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.